మూతలు లేక.. ముక్కలై


ఎంఏనగర్ రోడ్డులో మూతలేని మ్యాన్‌హోల్

- ప్రమాదకరంగా మ్యాన్‌హోళ్లు
- అసలే వర్షాకాలం..
- అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

మియాపూర్: డివిజన్ పరిధిలోని ప్రధానరోడ్లపై మ్యాన్‌హోళ్లు ప్రమాదకరంగా మారాయి. ధ్వంసమైన, మూతలు లేని మ్యాన్‌హోళ్లతో వాహనదారులు తరచు ప్రమాదాల బారిన పడుతున్నారని, దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోయారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని దత్తసాయి కాలనీ, స్వర్ణపురికాలనీ మయూరీనగర్, ఎంఏనగర్, ప్రశాంత్‌నగర్, లక్ష్మీనగర్ పలు కాలనీలలో మ్యాన్‌హోళ్లు కుంగిపోవడంతో బాటు ధ్వంసమయ్యాయి. లక్షల రూపాయలతో చేపట్టే అభివృద్ధి పనులపై ప్రజాప్రతినిధులు, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో కొద్దిరోజులకే పాడవుతున్నాయని కాలనీవాసులు విమర్శిస్తున్నారు. మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేపట్టాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. అసలే వర్షాకాలం దీనికితోడు మ్యాన్‌హోళ్లు ధ్వంసమై, మూతలు లేకపోవడంతో వర్షాలు కురిసినపుడు వాహనదారులు, పాదచారులకు ఇవి కనిపించకపోవడంతో ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. గత కొన్ని నెలల కిందట నగరంలో మ్యాన్‌హోల్‌లో పడి ఓ చిన్నారి మృతి చెందిన ఘటన నెలకొన్నా అధికారులు అలసత్వం వహించడంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


మియాపూర్ పోలీస్‌స్టేషన్ రోడ్డులో మూత లేని మ్యాన్‌హోల్


హెచ్ఎంటీ స్వర్ణపురి కాలనీలో..


శ్రీ సాయిరాంనగర్ కాలనీలో..

రంగనాథుడి భూముల కౌలు వేలం తగదు

ఎమ్మెల్యే గాంధీని కలిసిన ఆలయ కమిటీ ప్రతినిధులు


ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం ఇస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రాయదుర్గం: గోపన్‌పల్లిలోని రంగనాథస్వామి ఆలయ భూముల కౌలు వేలంను ఆపించాలని ఆలయ కమిటీ ప్రతినిధుల బృందం డిమాండ్ చేసింది. శుక్రవారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని ఆయన నివాసంలో ఆలయ కమిటీ ప్రతినిధుల బృందం కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఆలయానికి శతాబ్దాల చరిత్ర ఉందని అప్పట్లో జమీందార్లు దూబే పరివారానికి చెందినవారు ఆలయ ధూప దీప నైవేద్యాలు, ఉత్సవాల నిర్వహణ కోసం భూములను కేటాయించారని తెలిపారు. వీటిని రెండేళ్ల కౌలుకు బహిరంగ వేలం వేయడం సమంజసం కాదన్నారు.ముందుగా ఆలయ భూములను సర్వే చేయించాలని, శ్రీరంగబావిని పునరుద్ధరించాలని కోరారు. న్యాయం జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే గాంధీ వారికి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే గాంధీని కలిసిన వారిలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రవీంద్ర ప్రసాద్ దూబే, కమిటీ సభ్యులు నర్సింహ, చంద్ర మౌళి, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

సిల్క్ ఇండియా ఎగ్జిబిషన్ ప్రారంభం



మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో శుక్రవారం సిల్క్ ఇండియా ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఒరిస్సా, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్, మణిపూర్, అస్సాం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన కళాకారుల ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచారు. ఈనెల 16వ తేదీ వరకు ప్రదర్శన ఉంటుందని ప్రవేశం ఉచితమని నిర్వాహకులు తెలిపారు. వరలక్ష్మి ఫెస్టివల్ చీరలు, హ్యాండ్‌లూమ్ జువెలరీ ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణగా ఉంది. కంచి, గద్వాల్, వెంకటగిరి, బెనారస్, పట్టు లంగాలు, ప్యూర్‌జరీ చీరలు ఉన్నాయని తెలిపారు. కాగా పాతపట్టు చీరలు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఫోన్ 9700565722లలో సంప్రదించగలరు.

కార్మికుల కనీస వేతనాలు సవరించాలి


మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్
- పటాన్‌చెరు పారిశ్రామికవాడలోకి ప్రవేశించిన జీపుజాతా

పటాన్‌చెరు: ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కార్మికుల కనీస వేతనాలను వెంటనే సవరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాలు సవరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 4 నుంచి చేపట్టిన రాష్ట్రవ్యాప్త జీపు జాతా శుక్రవారం పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలోకి ప్రవేశించింది. ఎంఎస్ఎన్ రుద్రారం, పాశమైలారంలోని కిర్బీ పరిశ్రమ వద్ద వారు మాట్లాడారు. రాష్ట్రంలో 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు 15 ఏళ్లుగా కనీస వేతనాలు సవరించలేదన్నారు. ఈ నేపథ్యంలో జూన్ 12 నుంచి జూలై 17 వరకు సీఐటీయూ కార్మికుల సమస్యలు తెలుసుకునేందుకు జిల్లాలో జూలై 4 నుంచి జీపు జాతా ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్రంలో కార్మికుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోందన్నారు. ప్రతీ పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికులు నూటికి 90 శాతం పైగా ఉన్నారన్నారు. ఇందులో ఎక్కువగా వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చిన కార్మికులే పనిచేస్తున్నారన్నారు. ఈనెల 17 వరకు జీపు జాతా కొనసాగుతుందని ఈలోపు ప్రభుత్వం స్పందించి కనీస వేతనాలను సవరించాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సింహారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పాండురంగారెడ్డి, సురేశ్, నరేశ్, శాంతకుమార్, జయకుమార్, చంద్ర కిరణ్ సింగ్, మల్లేష్, శ్యామ్, కార్మికులు పాల్గొన్నారు.

యూజీడీ పనులు ప్రారంభం


పనులను పరిశీలిస్తున్న కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

రాయదుర్గం: టీఎన్‌జీఓ కాలనీలో శుక్రవారం రూ.8.75 కోట్ల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించడంతో స్థానికులు, కాలనీ సంక్షేమ సంఘం హర్షం వ్యక్తం చేస్తోంది. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థతో మురుగు సమస్య తీరుతుందన్నారు. కాలనీలో చేపట్టిన పనులను సంక్షేమ సంఘం ప్రతినిధులు పరిశీలించారు. సంఘం అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి కె.జోసఫ్, సంయుక్త కార్యదర్శి ఏ శంకరయ్య, సభ్యులు శ్రీరాములు, అశ్రఫ్, జోగారావు, కాంట్రాక్టరు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ రాజశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాజీవ్‌నగర్ ఫీడర్ పరిధిలోని రాజీవ్‌నగర్, గుల్షన్‌నగర్, పీవీఆర్ ఆట్రియం మాల్ పరిసరాలు, రోలింగ్ హిల్స్ ఫీడర్ పరిధిలోని రాంకీ టవర్స్, రోలింగ్ హిల్స్, అంజయ్యనగర్ తదితర ప్రాతాలలో విద్యుత్ ఉండదని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాన్ని సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహిస్తారు. 'సస్టేయినింగ్ ది ఎన్విరాన్‌మెంట్ అండ్ రెజువెనేటింగ్ ది థాట్స్' అనే అంశంపై సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, సీఈఈఆర్ఐ రీసెర్చ్ సైంటిస్ట్ మధులికా శర్మ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాల కోసం 040-23001234లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఏడుగురికి కోవిడ్ ర్యాపిడ్ యాంటిజెన్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. పది మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు చేశామన్నారు.

15 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బుధ, గురువారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 16 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా జడ్జి 11 మందికి ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున, ఇద్దరికి మూడు వేలు, ఒకరికి రూ.5 వేలు, మరో వ్యక్తికి రూ.4,500 జరిమానాతో పాటు ఏడు రోజుల జైలు శిక్ష విధించారన్నారు.

పార్కుల అభివృద్ధికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కాలనీల్లో పార్కుల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని కార్పొరేటర్ పుష్ప నగేష్ తెలిపారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ బాల విహార్ పార్కును ఆమె సందర్శించి మాట్లాడారు. చెత్త పేరుకుపోయిందని.. అధికారుల దృష్టికి తీసుకెళ్లి శుభ్రం చేయిస్తామని చెప్పారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తదితరులు

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ఇసుక బావి పోచమ్మ తల్లి ఆలయ పంచమ వార్షికోత్సవంలో శుక్రవారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, కౌన్సిలర్ కవిత శ్రీనివాస్‌రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నివాళి



గచ్చిబౌలి: కొండాపూర్ టీఎస్ఎస్‌పీ 8వ బెటాలియన్‌లో ఏఆర్ఎస్ఐ వెంకటప్ప రెడ్డికి ఘనంగా నివాళులు అర్పించారు. శుక్రవారం బెటాలియన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమాండెంట్ పి.మురళీకృష్ణ నివాళులు అర్పించారు. కార్యక్రమంలో 8వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ టీఎన్ సింగ్ తదితరులు ఉన్నారు.

శానిటరీ న్యాప్‌కిన్‌లు పంపిణీ


గోపన్‌పల్లిలో అవగాహన కల్పిస్తున్న ఏబీవీపీ మహిళా ప్రతినిధులు

రాయదుర్గం: అఖిలభారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం 'రితుమతి' అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏబీవీపీ మహిళా విభాగం ప్రతినిధులు, హెచ్‌సీయూ గరల్స్ విభాగం కన్వీనర్ సాక్షి, ఉపాధ్యక్షురాలు షేక్ ఆయేషా, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు పర్ణికాచౌహాన్, జాయింట్ కార్యదర్శులు రీతాంజలిపాత్ర, శ్రితికా ఆధ్వర్యంలో గోపన్‌పల్లి గ్రామంలో బాలికలు, మహిళలకు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శానిటరీ న్యాప్కిన్స్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరో రెండురోజులపాటు కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏబీవీపీ ప్రతినిధులు కొర్రబిందు, రేణు ఫర్‌కరీమ్, అనూష, స్వప్నరాణి, కెరిస్టిన్‌కుంద్రకమ్, వీనస్, ముస్కాన్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కోర్సులకు మంచి ఆదరణ

కూకట్‌పల్లి: ఇంటర్ తరువాత డిగ్రీ చదివే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని వివేకానంద డిగ్రీ కళాశాల డైరెక్టర్ డాక్టర్ కొరదాల నరేష్ తెలిపారు. కూకట్‌పల్లిలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో బీఎస్సీ డేటా సైన్స్, బీకాం, కంప్యూటర్ అప్లికేషన్, బీబీఏ, బీసీఏ వంటి డిగ్రీ కోర్సులతో పాటు పీజీలో ఎంఎస్సీ మ్యాథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్ గ్రూపుల్లో అడ్మిషన్లు పొందవచ్చునని తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ గుర్తింపు పొందిన ఈ కళాశాలలో అడ్మిషన్ల కొరకు దోస్త్ వెబ్‌సైట్‌లో కోడ్ 11250ను సందర్శించి కళాశాలను ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు. వివేకానంద డిగ్రీ కళాశాల నుంచి ప్రతి సంవత్సరం క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా అనేక మంది ఎంఎన్‌సీ కంపెనీల్లో సైతం ఉపాధి అవకాశాలు పొందుతున్నారని తెలిపారు. మరిన్ని వివరాలకు 93940 68321 నంబర్లో సంప్రదించగలరు.

సంఘమిత్ర డిగ్రీ కళాశాలలో..

కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయం పక్కన ఉన్న సంఘమిత్ర డిగ్రీ కళాశాలలో బీఎస్సీ డేటా సైన్స్, బీకాం, కంప్యూటర్ అప్లికేషన్, బీబీఏ, బీసీఏ వంటి డిగ్రీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాలకు 9553955724 నంబర్లో సంప్రదించగలరు.

ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు

నిజాంపేట్: మెరుగైన వసతులు కల్పిస్తూ డివిజన్‌ను అభివృద్ధి పథంలో తీసుకువెళ్తున్నామని నిజాంపేట్ కార్పొరేషన్ 18వ డివిజన్ కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయిఅనురాగ్ కాలనీలో రోడ్డు నెంబరు 1, 1-బి, 12-బిలలో రూ.40 లక్షలతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రాధాన్యత క్రమంగా ప్రతి కాలనీ, బస్తీలో కనీస సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు జనార్దన్, కిరణ్, శంకర్‌రావు, శ్యామ్, శ్రీనివాస్, సెబాస్టియన్, పాపారావు, ఫణి, యలమంద తదితరులు ఉన్నారు.

అక్షరాభ్యాసం

నిజాంపేట్: అంగన్‌వాడీ కేంద్రాలు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని నిజాంపేట్ కార్పొరేషన్ 19వ డివిజన్ కార్పొరేటర్ కాసాని సుధాకర్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం బాచుపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన చేయించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పౌష్టికాహారం అందజేస్తోందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కమ్మెట భూపాల్, వాసు, నందిగామ మహేష్ , అంగన్‌వాడీ టీచర్ మనిమల, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి


నూతనంగా ఎన్నికైన సభ్యులతో నాయకులు

పటాన్‌చెరు టౌన్: బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పటాన్‌చెరు డివిజన్ అధ్యక్షుడు నాగరాజు యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం పటాన్‌చెరు డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, కార్యదర్శిగా వెంకటేశ్, ఓబీసీ మోర్చా పట్టణ ఉపాధ్యక్షుడుగా జీవన్ సింగ్‌ను ఎన్నుకొని నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్, పట్టణ ఇన్‌చార్జి దేవేందర్‌గౌడ్, రాష్ట్ర యువ మోర్చా కార్యవర్గ సభ్యులు రాంబాబు గౌడ్, శ్రీనివాస్, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సుజాత, పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు రజిని పాల్గొన్నారు.

సైబర్ వలలో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

పటాన్‌చెరు టౌన్: సైబర్ వలలో పడ్డ ఇద్దరు మహిళా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు డబ్బులు పోగొట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ వందనపురి కాలనీకి చెందిన ఓ మహిళ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి జూన్ 28వ తేదీన ఆమె వాట్సాప్‌కి బిట్ కాయిన్‌కు సంబంధించిన ఓ లింక్ వచ్చింది. దీంతో బాధితురాలు తన వివరాలు నమోదు చేసింది. బిట్ కాయిన్‌లో నగదు ఇన్వెస్ట్ చేస్తే రెట్టింపు నగదు వస్తుందనే ఆశతో ఐదు దఫాలుగా రూ.1,98,000లు సైబర్ నేరగాళ్లు చెప్పినట్టుగా వేసింది. ఇంకా నగదు వెయ్యాలని కోరడంతో అనుమానంతో ఆమె తను ఇన్వెస్ట్ చేసిన నగదు చెల్లించాలని వారిని కోరింది. దీంతో సైబర్ నేరస్తులు స్పందించలేదు. ఈ క్రమంలో తను మోసపోయినట్లుగా గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనంతరం శుక్రవారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

మరో సంఘటనలో..

అమీన్‌పూర్ త్రిశూల్ డిఫెన్స్ కాలనీకి చెందిన ఓ మహిళా సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి జూలై 2వ తేదీన అమెజాన్ పే బ్యాలెన్స్ లింక్ వచ్చింది. నగదు ఇన్వెస్ట్ చేస్తే కమీషన్ ఇస్తామని చెప్పడంతో బాధితురాలు పలుదఫాలుగా రూ.2,35,000లు ఇన్వెస్ట్ చేసింది. తను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడగడంతో సైబర్ నేరస్తులు స్పందించలేదు. విషయం తెలుసుకున్న ఆమె మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనంతరం శుక్రవారం అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది.

10న భవిష్యనిధి అదాలత్...

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ ఫండ్ (పియఫ్) కార్యాలయంలో భవిష్యనిధి అదాలత్ నిర్వహించనున్నట్లు పియఫ్ కమీషనర్ డా. హేమంత్ తెలిపారు. ఈ నెల 10వ తేదిన ఉదయం 10 గంటలకు కూకట్‌పల్లి ప్రశాంత్ నగర్‌లోని ఆర్‌టిసి బస్‌స్టాండ్‌లోని రెండవ అంతస్తులో గల పియఫ్ కార్యాయలంలో ఉంటుందని, ఖాతాదారులు తమ సమస్యలు పరిష్కరించుకోవటమే కాకుండా తగిన సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలిపారు. కూకట్‌పల్లి, మియాపూర్, లింగంపల్లి, బీహెచ్ఇఎల్, జీడిమెట్ల, సనత్‌నగర్ ఖాతాదారులు పాల్గొనవచ్చని తెలిపారు.

ఘనంగా శంకర నేత్రాలయ వార్షికోత్సవం

మియాపూర్ : మదీనాగూడలోని శ్రీ శంకర నేత్రాలయ కంటి ఆసుపత్రి 14వ వార్షిక వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. 14 సంవత్సరాలుగా 2లక్షల మందికి వైద్యం అందించామని, అందులో 50వేల మందికి కంటి సర్జరీలు చేశామన్నారు. ఒక్క రోజు వయస్సుగల శిశువు నుండి 107 సంవత్సరాల వృద్దుల వరకు చికిత్స చేశామని తెలిపారు.

సమస్యలు పరిష్కరిస్తా...


ఆల్విన్‌కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్ కాలనీ ఫేజ్ 2లో డ్రైనేజీ, రోడ్ల సమస్యలను స్థానికులు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకురాగా ఆయన శుక్రవారం ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో ఒక వీధిలో డ్రైనేజీ లైన్, సీసీ రోడ్డు పనులు పెండింగ్‌లో ఉన్నాయని, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని కాలనీ ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, కాలనీ అధ్యక్షుడు కృష్ణారావు, భాస్కర్‌రెడ్డి, పోశెట్టి గౌడ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



మియాపూర్ : వాకింగ్‌కు వెళ్లిన మహిళ అదృశ్యమైంది. మియాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ ప్రగతి ఎన్‌క్లేవ్ కాలనీలో నివాసముంటున్న వరద జగదాంబ(55) గురువారం ఉదయం 5.45లకు వాకింగ్ అని ఇంటి నుండి బయటికి వెళ్లింది. ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో విచారించినా ఆచూకీ లభ్యం కాలేదు. కాగా జగదాంబ కొంతకాలంగా మానసిక సమస్యతో బాధపడుతుందని తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులు మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అపరిశుభ్రంగా ఉన్న హాస్టల్స్ సీజ్

కూకట్‌పల్లిలో 24 హాస్టళ్లపై కొరడా ఝుళిపించిన అధికారులు


హాస్టల్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి పరిధిలోని పలు హాస్టళ్లను శుక్రవారం జీహెచ్‌యంసీ అధికారులు తనిఖీ చేశారు. నిబంధనలు పాటించకుండా అపరిశుభ్ర వాతావరణంతో పాటు, స్థానికులకు ఇబ్బంది కలిగించే విధంగా ఉన్న వాటిని సీజ్ చేశారు. గురు, శుక్రవారాల్లో కూకట్‌పల్లిలో ఇళ్ల మధ్యలో ఉన్న 24 హాస్టల్స్‌లో కూకట్‌పల్లి ఏఎంహెచ్ఓ మమత, శానిటేషన్ సిబ్బంది, పలువురు అధికారులు వసతులను పరిశీలించారు. ముఖ్యంగా వంట గదులు అపరిశుభ్రంగా ఉండడంతో బాటు , అనారోగ్యకర పరిస్థితుల్లో ఆహార పదార్థాలు నిల్వ ఉంచటాన్ని గుర్తించారు. అంతేకాకుండా స్థానికులకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరిస్తున్న పలు హాస్టళ్లపై కొరడా ఝుళిపించారు. మరోవైపు మహిళా, పురుషుల హాస్టల్స్ ఎక్కువగా ఉండటంతో శాంతి భద్రతల సమస్య కూడా పెరుగుతుండటంపై వచ్చిన ఫిర్యాదుల మేరకు కూకట్‌పల్లిలో సుమారు 24 హాస్టల్స్‌ను సీజ్ చేయటం జరిగిందని మమత తెలిపారు. ఇటీవల కాలంలో హాస్టల్స్ వలన తమకు ఇబ్బంది కలుగుతోందని స్థానికులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు కూడా ఫిర్యాదు చేయటం జరిగింది. ఈ మేరకు అధికారులు విచారణ చేయాల్సిందిగా ఆదేశించారు. ఇదే తరహాలో మిగతా హాస్టల్స్‌లో కూడా తనిఖీలు నిర్వహిస్తామని ఆమె వివరించారు.